చదువుతున్న దినపత్రికని మడతేస్తూ రాజారావు గట్టిగా "ఆకలి దంచేస్తోంది. అన్నం పెడతావా?'' బెడ్రూంలోంచి అరిచాడు.


టీవీ చూస్తున్న అతని భార్య సబిత భర్త కేక విని సోఫాలోంచి లేచి "ఆ...ఆ! ఇదిగో వడ్డించేస్తున్నా. కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చేయండి'' చెప్పింది.

పిల్లలిద్దరూ వాళ్ల వాళ్ళ రూమ్స్‌లో కూర్చుని సీరియస్‌గా చదువుకుంటుండడం రాజారావు గమనించి-

"ఏమ్రా పిల్లలూ! అన్నం తిందాం రండి'' పిలిచాడు. వాళ్ళు వద్దంటూ తల ఆడించారు.

# పొరుగింటి చల్లకూర

- వారణాసి రామకృష్ణ



ఎందుకని అడిగేలోపలే సబిత వచ్చి "వాళ్లకింకా ఆకళ్ళు లేవుట. ముందు మీరు తినేయండి! రండి'' అని డైనింగ్ టేబుల్ దగ్గరికెళ్లి అన్నం వడ్డించింది.

రాజారావు భోజనానికి ఉపక్రమించి టేబుల్ మీదున్న పదార్థాలను గమనించి నిరాశగా భార్య ముఖంకేసి చూస్తూ-

"ఏంటి! ఈ పూట కూర ఏమీ చేయలేదా?'' అడిగాడు.

"ఊహూ! పొద్దున్నదే పప్పు బోలెడంత మిగిలిపోయింది. ఇక గోంగూర పచ్చడి, దోసావకాయ ఎలాగూ ఉన్నాయి. ఇంకెందుకులే అని కూర చేయలేదు.''

ఆమె జవాబుకి చర్రున కోపం వచ్చింది రాజారావుకి.





## ఉపవాసం

''ఏమోయ్ సింగినాథం! బస్సు టైరులా ఉండేవాడివి. ఇలా ఒక్కసారిగా సైకిల్ టైరులా తయారయ్యావేంటి? డైటింగ్‌లాంటిదేమైనా చేస్తున్నావా?'' అడిగాడు ఆనందరావు.

''డైటింగా నా బొందా! మా ఆవిడ కడుపు పండితే నా చేత నెలరోజులు ఉపవాసాలు చేయిస్తానని తిరుపతి వెంకటేశ్వరస్వామికి మొక్కుకుందట'' నీరసంగా చెప్పాడు సింగినాథం.

## కరెంటు బిల్లు

''వదినగారూ! ఈనెల కరెంటు బిల్లు మీకు తక్కువ వచ్చిందిటగా! బిల్లు తగ్గడానికి ఏం ప్రయోగం చేసారో నాకూ చెప్పరూ!'' అడిగింది మంగమ్మ.

''ఇందులో చెప్పవలసినంత గొప్ప విషయమేమీ లేదు. మీ ఇరుగుపొరుగువాళ్ళ ఇళ్ళల్లో ఎవరింట్లో కలర్ టీవీ వుంటే వాళ్లింట్లో సాయంత్రంవరకూ గడిపేయ్. నీకూ బిల్లు తగ్గుతుంది'' చెప్పింది రంగమ్మ.

**- డి.లక్ష్మి**
(రామతీర్థం)





"ఎన్నిసార్లు చెప్పినా ఇట్లానే చేస్తావేం సబితా! ఏదో ఒక కూర చెయ్యకపోయావా?''

"పొద్దున వండినదే ఎంత పప్పు మిగిలిపోయిందో చూడండి. ఇప్పుడు మళ్ళీ మరో ఐటమ్ కూర చేస్తే మళ్ళీ ఆ కూర, ఈ పప్పు రెండూ రేపటిదాకా ఉండిపోతాయి.''

"ఉంటే ఉండిపోతాయి. మిగిలిపోతాయి కదాని నేనీ పచ్చుళ్ళు వేసుకుని తినలేదు. నీకు తెలియదా నా సంగతి!''

మొహం చిట్లిస్తూ చిరాకుగా పచ్చుడన్నం తినసాగాడు. చూస్తున్న సబితకి చాలా బాధ కలిగింది. భర్తకి తృప్తిగా అన్నం పెట్టలేకపోయానే అని దుఃఖం కలిగింది. కానీ అంతలోనే గత పదిరోజులుగా జరుగుతున్న విషయాలు గుర్తొచ్చాయి.


ప్రతిరోజూ చేసిన వంటకాలు చేసినట్లు మిగిలిపోవడమే! పొద్దున్నవి రాత్రి, రాత్రివి మర్నాడు! ఒక్కోసారి మూడోనాడు కూడా. ఇలాగే మిగిలిపోతూ అటు పిల్లలకి పెట్టలేక ఇటు భర్తకి వడ్డించలేక తనూ తినలేక అలాగని వాటిని పారెయ్యలేక నానా అవస్థగా వుంది.

బలవంతంగా పచ్చడి మెతుకుల్ని తింటున్న భర్తని జాలిగా చూసి "పోనీ రెండు బంగాళాదుంపలు కోసి వేయించమంటారా! తొందరగా అయిపోతుంది'' అడిగింది.

ఆ మాటకి మరింత మండుకొచ్చి రాజారావు "నన్నిక్కడ అన్నానికి కూచోబెట్టి ఆ మాట చెప్పకపోతే ముందే అదేదో తగలడి చావొచ్చు కదా'' విసురుగా అన్నాడు.

"అది కాదండీ. రోజూ కూర, పప్పు ఇంతింత మిగిలిపోతున్నాయి. వేస్టెందుకు చెయ్యడం అని అడిగి చేద్దాములే అని ఊరుకున్నాను.''

దాంతో రాజారావు మరింత కోపంగా, వ్యంగ్యంగా "అవునవును. ఎక్కడా లేని వేస్టు, పొదుపు మేనేజిమెంటు నా తిండి దగ్గరే వస్తుంది. ఛీ...ఛీ ఇంత కష్టపడుతున్నాను. సంపాదిస్తున్నాను. కూరలు, పప్పులు, నూనెలు నెలనెలా కొని ఆ సంచులన్నీ నేనే మోసుకుని తెచ్చి ఇంట్లో పడేస్తున్నాను. అయినా ఆకలేసినప్పుడు కడుపుకింత తృప్తిగా తినే యోగ్యత మాత్రం లేదు.''




గట్టిగా అరిచి అన్నం ముందు నుంచి లేచెళ్లి చెయ్యి కడుక్కున్నాడు.

''అయ్యయ్యో అది కాదండి. ఈ పిల్లలు ఒక రోజు తింటారు, ఒక రోజు తినరు. ఏ రోజు తింటారో, ఏ రోజు తినరో తెలీదు. సాయంత్రం నుంచి ఎన్నిసార్లు అడిగినా ఆకళ్ళు లేవంటున్నారు కదా అని వేరే ఏమీ వండలేదండీ!'' సంజాయిషీ ఇస్తున్నట్లు కళ్లనీళ్ళు పెట్టుకుంది.

"ఇందాక వేస్ట్ చేయడం ఇష్టంలేదని వండలేదన్నావు. ఇప్పుడేమో పిల్లలు తినట్లేదని వండడం లేదంటున్నావు. అన్నీ నీ ఇష్టమే! ఎట్లా కావాలంటే అట్లా చెప్తావు.''

కోపంగా బెడ్రూమ్‌లోకెళ్లి ప్యాంటు షర్టు వేసుకుని బైటికెళ్లబోయాడు.

ఆమె అతన్ని అనుసరించి "అయ్యో! ప్లీజ్... అర్థం చేసుకోండి'' అంటూ ఏదో చెప్పబోయినా "ఇంకేం చెప్పకు. తినేదానికీ రాతుండాలి'' వేగంగా బైటికెళ్ళిపోయాడు.

సబితకేం చేయాలో అర్థంకాక మౌనంగా రోదిస్తూ నిస్సహాయంగా సోఫాలో కూలబడింది.

రాజారావు గబగబా నడుస్తూ వెళ్లి సెంటర్‌కి చేరాడు. ఎటువైపు వెళ్దామా అని ఆలోచిస్తూ అసహనంగా, కోపంగా పక్కకి తిరిగేసరికి వేగంగా దూసుకొచ్చిన స్కూటర్ ఢీకొనబోయి ఆఖరి క్షణంలో కీచుమని శబ్దం చేస్తూ ఆగింది.

స్కూటర్ నడుపుతున్న చంద్రశేఖర్ అకస్మాత్తుగా అడ్డం వచ్చిన వ్యక్తిని తిట్టబోయి రాజారావుని చూసి-

"అరేయ్ రాజా! నువ్వా? ఏమిట్రా ఇలా ఇక్కడ తిరుగుతున్నావు?'' ఆశ్చర్యంగా అడిగాడు.

తన ఫ్యామిలీ ఫ్రెండు శేఖర్‌ని చూసిన రాజారావు ఎదురుగా కనిపించే హోటల్‌ని చూసి "పదరా! హోటల్‌లో భోజనం చేస్తూ మాట్లాడుకుందాం'' అన్నాడు.

"హోటల్‌లోనా? ఏం? సబిత పుట్టింటికి వెళ్లిందా ఏంటి?'' శేఖర్ అడిగాడు.

"ఊహూ... ఇక్కడే వుంది'' ఇంకేం చెప్పాలో తోచక ఆగిపోయాడు.

"మరి?'' అంటూ రాజారావుని పరిశీలనగా చూసి "ఏంట్రా ఇంట్లో అలిగావా?'' నవ్వుతూ ప్రశ్నించాడు.

రాజారావు కోపంగా జరిగిందంతా చెప్పాడు.

అన్నీ విన్నాక శేఖర్ నవ్వేస్తూ "అదా సంగతి. సరే పద పద. ఇంటికెళ్లాం ముందు. అవతల సబిత ఏం కంగారు పడుతోందో'' అంటూ రాజారావుని స్కూటర్ వెనక కూర్చోబెట్టుకుని ఇంటికి తీసుకవచ్చాడు.

ఇంటి దగ్గర ఆగిన స్కూటర్ శబ్దం విని రాజారావు పిల్లలిద్దరూ బైటికొచ్చి శేఖర్‌ని చూడగానే "హాయ్ శేఖరంకుల్... శేఖరంకుల్'' అంటూ ఆనందంతో గంతులు వేసారు.

సబిత ఆశ్చర్యంగా బైటికొచ్చి "రండి...రండి... అన్నయ్యగారూ'' ఆహ్వానించింది.

శేఖర్ లోపలికొచ్చి "ఏమ్మా సబితా! ఎలా

వున్నావు? ఇవాళ వంటేం చేసావు? ఆకలి అదిరిపోతోంది అన్నం పెట్టు" అంటూ సరాసరి డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు.

పిల్లలిద్దరూ అతన్ని చూసిన ఆనందంలో వాళ్ళూ భోజనానికి కూర్చున్నారు. సబిత అందరికీ వడ్డించబోతుంటే శేఖర్ ఒక కంచం తీసి పక్కనపెట్టి "మీ ఆయనకి మాత్రం వడ్డించకు" అన్నాడు.

సబిత విస్తుపోతూ చూస్తే గట్టిగా నవ్వి "దాని వెనుకో చిదంబర రహస్యం వుందమ్మా" అంటూ రాజారావుతో "రేయ్! ఈ పూట నువ్వు భోజనం చేయడంలేదు" అన్నాడు.

రాజారావు కోపంగా "నువ్వు తినమని బలవంతం చేసినా నేను తిననులేరా" ఉక్రోషంగా అన్నాడు.

"అబ్బో మీ నాన్నకి ఉడుకెక్కువ" శేఖర్ పిల్లలతో చెప్పి నవ్వుతూ "వండ్రఫుల్... గోంగూర పచ్చడి చూస్తుంటే నోట్లో నీళ్ళు ఊరుతున్నాయి. ఆహా దోసావకాయ... భలే కాంబినేషన్" అంటూ జోకులేస్తూ పిల్లలకి తనే వడ్డిస్తూ భోజనం చేసాడు. అంకుల్ని చూసిన హుషారులో పిల్లలిద్దరూ శుభ్రంగా అన్నం తినేసారు.

శేఖర్ భోజనం చేశాక రాజారావుకి స్కూటర్ తాళాలిచ్చి "రేయ్! స్కూటర్ స్టార్ట్ చేస్తుండు. వక్కపొడి పలుకు వేసుకుని నేనీలోగా వచ్చేస్తా" అంటూ రాజారావుని బైటకు పంపేసి సబితతో-

"ఏమ్మా! ఈ పూటతో నీ ప్రాబ్లెం తీరిపోయిందా? వెరీగుడ్. గిన్నెలో అన్నం ఉంది. హాయిగా భోజనం చేయి. వాడి గురించి వెయిట్ చేయకు. మరో గంటలో వాడ్ని మళ్లీ తీసుకొచ్చి డ్రాప్ చేస్తాను. నువ్వేం వర్రీ కాకు. సరేనా?" అంటూ చెప్పేసి బైటికెళ్లి ఆపాటికే స్కూటర్ స్టార్ట్‌చేసి నిలబడ్డ రాజారావుని చూసి "పదరా" అంటూ స్కూటర్ వెనుక కూర్చున్నాడు.

రాజారావు స్కూటర్‌ని ముందుకు పోనిస్తూ "ఎక్కడికిరా ఇప్పుడు?" అయోమయంగా అడిగాడు.

శేఖర్ సీరియస్‌గా "మా ఇంటికి!" అన్నాడు.

"మీ ఇంటికా? ఇప్పుడా? ఎందుకు?" విస్తుపోతూ రాజారావు స్కూటర్ ఆపాడు.

"పదరా ఫూల్! ఎందుకని అడుగుతావేంటీ? ఇప్పుడు నువ్వు మా ఇంటికొచ్చి భోజనం చేయకపోతే మీ ఇంట్లో జరిగిన హాట్ సీన్ రేపు మా ఇంట్లో కూడా జరుగుతుంది."

"అంటే?"

"ఇంకా అర్థం కాలేదా నీకు? నేను తినని నా వాటా అన్నం, పప్పు మిగిలిపోయి వాటి ఖరీదు, ధరలు గుర్తుకొచ్చి మా ఆవిడ పారెయ్యలేక, దాచిపెట్టి రేపు వాటినే నాకు వడ్డిస్తుంది. దాంతో నాకూ కోపం వచ్చి ఆవేశాలు, కోపాలు! అవి తగ్గేదాకా, అలక తీరేదాకా రోడ్లమీద చక్కర్లు. షరా మామూలే!"

"అంటే... అంటే నువ్వూ మీ ఇంట్లోంచి కోపంగా బైటపడి..."

రాజారావు మాట పూర్తి చేయకముందే "అవున్రా ఫూల్! అసలు ఓ గంట ముందు నువ్వు కనిపించి వుంటే నేనే వీర లెవెల్లో కోపంగా మా ఇంట్లో జరిగింది చెప్పేవాడిని" అన్నాడు శేఖర్.

"ఓర్నీ! ఇంతకీ ఏం జరిగిందిరా?" రాజారావు ఆశ్చర్యంగా అడిగాడు.

"ఇప్పుడేం చెప్పగలను? వేడి అంతా చల్లారిపోయాక" శేఖర్ గట్టిగా నవ్వి "పొద్దున మిగిలిందేదో వంకాయ కూరట. చల్లగా వున్నది వడ్డిస్తే చర్రున కోపం వచ్చి నానా తిట్లు తిట్టి నేను ఆవేశపడి మా ఆవిడకి బిపీ తెప్పించి ఆఖరికి తీరిగ్గా ఇంట్లోంచి బైటపడి స్కూటర్‌మీద తిరుగుతుంటే నువ్వు నా స్కూటర్‌కడ్డం పడ్డావు" చెప్పాడు.

"అయితే గొడవలు, ఘర్షణలు మీ ఇంట్లో కూడా..."

"యస్! ఇవి అందరి ఇళ్లల్లో ఉండేవే! పిల్లలున్న ఇంట్లో ముఖ్యంగా ఈ దశ ఒకటి నడుస్తూంటుందిరా. మనం కష్టపడి ఫ్యాక్టరీలో పని చేస్తూ డబ్బు సంపాదిస్తున్నాం. తినే తిండి విషయంలో ఎలాంటి రాజీ పడకుండా ఉండాలనుకుంటాం. అయితే మొగుళ్ళు కష్టపడి సంపాదిస్తున్నారు! కనీసం కాస్త చెయ్యగలిగినంత ఆదా చేద్దామన్న ఆలోచన మన ఇల్లాళ్ళదిరా! పాపం వాళ్ళ తాపత్రయం మనకర్థం కాక ఆవేశంలో అరిచేస్తాం, కోపంతో రెచ్చిపోతాం. అయితే ఇవన్నీ తర్వాతనయినా కూల్‌గా ఆలోచించి అర్థం చేసుకుని సంసారమనే రథాన్ని మనమే గదరా నడపాల్సింది. ఏమంటావు?"

చిరునవ్వుతో చెప్తున్న శేఖర్ని చూసి రాజారావూ ఫక్కున నవ్వేసి-

"ఆకలి అదరగొట్టేస్తోంది. వెంటనే మీ ఇంటికెళ్లి పొరుగింటి చల్లకూర పీకలదాకా తినాలనుందంటాను" సరదాగా చెప్పాడు.


"వెరీగుడ్! ఛలో అయితే" శేఖర్ భుజంమీద స్నేహంగా చరిచాడు.

రాజారావు స్కూటర్‌ని నేరుగా తెచ్చి శేఖర్ ఇంటి ముందు ఆపాడు. ఇంట్లోంచి శేఖర్ పిల్లలు దూసుకొచ్చి తండ్రిని, రాజారావుని మార్చి మార్చి చూస్తూ నవ్వుతూ-

"మమ్మీ! రాజం కుల్! రాజంకుల్ వచ్చారు మమ్మీ" గట్టిగా సంబరంగా అరిచారు.

వాళ్లిద్దరి భుజాల మీద చేతులు వేసి రాజారావు లోనికెళ్లాడు.

★



# ఎయిడ్స్ మహమ్మారి

ఎయిడ్స్ మహమ్మారి ప్రపంచాన్ని ఎంతగా భయపెడుతుందో మనందరికీ తెలిసిందే. కొలంబియాలోని బొగోటా నగరంలో ఎంతోమంది ఎయిడ్స్ పేషెంట్స్ ఉన్నారు. ఒక పరిశ్రమలో పనిచేసే చాలామందికి ఎయిడ్స్ సోకింది. ఖరీదైన మందులు అవసరం కనుక ఇక్కడ ఓ సంస్థలో ఆ వ్యాధి సోకినవాళ్లందరూ పని చేస్తున్నారు. 1993 తరువాత ఎయిడ్స్ బాధితుల కోసం మాజీ డాక్టర్ చొరవ తీసుకుని ఏడువేల మందికి ఆశ్రయం కల్పించాడు. ఈ సంస్థలో పని చేసే వాళ్లందరూ ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులే. ఒకరికొకరు తోడునీడగా ఉంటారు. వారి జీతం వారి మందులకే సరిపోతుందిట. అవున్మరీ ఎయిడ్స్ కదా!

– శశి

